సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 21 । మే । 2024



సాగర తీరం.. ఆహ్లాదకరం

పశ్చిమ గోదావరి జిల్లాలోని సాగర తీరం ఆహ్లాదకరంగా మారింది. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు జగన్ సర్కార్ చర్యలు చేపట్టింది. 8లో ▸



ఉదయం ఎండ.. మధ్యాహ్నం వర్షం

ఉమ్మడి జిల్లాలో ఉదయం తీవ్రమైన ఎండ వేడి.. మధ్యాహ్నం వర్షంతో భిన్న వాతావరణం నెలకొంది. సాయంత్రం ఈదురు గాలులు వీస్తూ భారీ వర్షం కురుస్తోంది. 8లో ▸



పశువుల బీమాతో ధీమా

పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారుల కోసం ప్రవేశపెట్టిన పశు బీమా రైతులకు ధీమా కలిగిస్తోంది. పశువులు చనిపోతే నష్టపరిహారం అందిస్తున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఏపీ ఈఏపీ సెట్



ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలో విద్యార్థుల హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 175 మందికి 172 మంది విద్యార్థులు హాజరుకాగా మధ్యాహ్నం షిఫ్ట్‌లో 175 మందికి 166 మంది హాజరయ్యారు. డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షకు ఉదయం 150 మందికి 146, మధ్యాహ్నం షిఫ్ట్‌కు 150 మంది 149 మంది విద్యార్థులు హాజరయ్యారు. విష్ణు కళాశాలలో ఉదయం 100 మందికి 97 మంది మధ్యాహ్నం 100 మంది 96 మంది విద్యార్థులు హాజరయ్యారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

భీమవరం: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె. ఉదయ భాస్కరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు జరిగే పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తిచేయాలన్నారు. జిల్లాలోని భీమవరం, ఆకివీడు, తాడేపల్లిగూడెం, తణుకు, పెనుగొండ, పాలకొల్లు, నర్సాపురం, అత్తిలిలో మొత్తం 41 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేస్తుండగా వాటిలో 8,953 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సిఉందన్నారు. పదో తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలకు సంబంధించి 1,590 మంది విద్యార్థులకు భీమవరం, నరసాపురంలో ఎనిమిది కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష సమయానికి అనువుగా ఆర్టీసీ బస్సులను నడపాలని ఉదయ భాస్కరరావు ఆర్టీసీ అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. వెంకటరమణ, టెన్త్ పరీక్షల నిర్వహణ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, జిల్లా విద్యుత్ శాఖాధికారి పీర్ అహ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక విద్య కోర్సుల్లో అడ్మిషన్లు

ఏలూరు రూరల్: రిహేబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సిఐ) డిప్లమో ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేసిందని కోర్సు కో–ఆర్డినేటర్ కె.శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌లో 50 శాతం మార్కులు సాధించిన ఓసీ, బీసీ విద్యార్థులు, 45 శాతం మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, ఫిజికల్ హ్యాండికాప్ విద్యార్థులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. కోర్సు పూర్తి చేసిన వారు డీఎస్సీ, సర్వశిక్షాభియాన్, ఐఆర్‌టి రీసోర్సింగ్ టీచర్లుగా పని చేసేందుకు అర్హులన్నారు. ఆసక్తి గలవారు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో పాటు విద్యార్హత, ఆధార్ జిరాక్స్ సర్టిఫికెట్లతో ఏలూరులోని దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్ సొసైటీని సంప్రదించాలని సూచించారు. మరింత సమాచారం కోసం 99486–00642 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి మీసాల వెంకన్న బ్రహ్మోత్సవాలు



మీసాల వెంకన్న స్వామి

కైకలూరు: మీసాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కై కలూరు శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 21 నుంచి 23 వరకు మూడు రోజులు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ ఈవో వీఎన్‌కే.శేఖర్ మాట్లాడుతూ మంగళవారం స్వామి, అమ్మవారిని పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెను చేయడం, సుదర్శన హోమం, మాడవీధుల్లో గజ వాహనంపై స్వామివారి ఊరేగింపు, పంచామృతాభిషేకాలు, బుధవారం రాత్రి 7.10 గంటలకు శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణం, మాడ వీధులలో శేష వాహనం స్వామివారి ఊరేగింపు, చివరి రోజు గురువారం పురవీధుల్లో గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు ఉంటుందన్నారు. సాయంత్రం శ్రీ మన్నారాయణ గోష్టి ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణ జరుగుతుందన్నారు. వైఖానస పద్ధతిలో శ్రీనివాస లక్ష్మణ ప్రవీణ్, బృందావనం లక్ష్మీనృసింహాచార్యులు, అగ్రిహోత్రం మిధునాచార్యులు, గోపీ కృష్ణమాచార్యులు యజ్ఞకత్వంలో కల్యాణోత్సవం జరుగుతోందన్నారు.

పల్లె చెంతకు మెరుగైన వైద్యం

- జిల్లాలో 365 మంది ఎంఎల్‌హెచ్‌పీలతో చికిత్స
- విలేజ్ క్లినిక్‌లలో 14 వైద్య పరీక్షలు
- అందుబాటులో 105 రకాల మందులు



విలేజ్ హెల్త్ సెంటర్



గర్భిణులకు సూచనలిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ

ఆకివీడు: ఇప్పుడు పల్లెలకు మెరుగైన వైద్యం చేరువైంది. ప్రతి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడంతో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతోంది. గతంలో ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలంటే రోగులు భయపడేవారు. కనీస వైద్యం అందుబాటులో ఉండకపోవడంతో ప్రభుత్వ దవాఖానాలు ఖాళీగా దర్శనమిచ్చేవి. వైద్య, ఆరోగ్య రంగానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలందుతున్నాయి. ప్రతి గ్రామంలో విలేజ్ క్లినిక్ సెంటర్లు ఏర్పాటు చేయడంతో వైద్యం పల్లె ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఒకప్పుడు వైద్యం అందని ద్రాక్షగా ఉండేది. నేడు వైద్యం ప్రజల ముంగిటకే రావడంతో గ్రామాల్లోనే మెరుగైన చికిత్స పొందుతున్నారు.

ఎంఎల్‌హెచ్‌పీల నియామకంతో మెరుగైన సేవలు

2019లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ) విధానం పల్లె ప్రజలకు మెరుగైన సేవలందిస్తోంది. గ్రామంలోనే పక్కా భవనం ఏర్పాటు చేసి, బీఎస్సీ నర్సింగ్ చేసిన వ్యక్తికి వైద్యంలో శిక్షణ ఇచ్చి, వైద్య సేవలందించేలా ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లోని ప్రతి 5000 మంది జనాభాకు ఒక ఎంఎల్‌హెచ్‌పీని ప్రభుత్వం నియమించింది. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వ్యక్తిని ఈ పోస్టులో నియమించారు. జిల్లాలో ఈ విధంగా 365 మందిని నియమించి వైద్యాన్ని పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. వీరితో పాటు ప్రతి 2500 మందికి ఒక ఏఎన్‌ఎం, 1000 మందికి ఒక ఆశా వర్కరు సెంటరులో సేవలందిస్తున్నారు. జిల్లాలో 70 శాతం విలేజ్ క్లినిక్ భవనాల నిర్మాణం పూర్తి కాగా, దానిలో ఇప్పటికే 40 శాతం పైగా భవనాల్లో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన సెంటర్లను అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు.

14 వైద్య పరీక్షలు : ఎంఎల్‌హెచ్‌పీల ద్వారా ప్రభుత్వం పేద ప్రజలకు పల్లెల్లోనే 14 వైద్య పరీక్షలు అందిస్తుంది. ఆధునిక వైద్య పరికరాలతో ఆయా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, శస్త్ర చికిత్స అవసరమైన వారికి టెలిమెడిసిన్ ద్వారా వైద్య సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉండే స్పెషలిస్టుల స్థాయిలో వివిధ విభాగాలకు స్పెషలిస్టుల ద్వారా వైద్యం సేవలందిస్తున్నారు. విలేజ్ క్లినిక్‌ల్లో బీపీ, సుగర్, వివిధ సీజనల్ వ్యాధులు, చిన్న పిల్లలకు వైద్యం, కంటి వైద్యం, ప్రమాదాల కేసులు, స్కూల్ విద్యార్థులకు ఆరోగ్య చెకప్‌లు, మానసిక వ్యాధిగ్రస్తులకు వైద్యం, రక్త పరీక్షలు, టీబీ, హెచ్‌ఐవీ కేసులు, బాలింత సేవలు, గర్భిణీ సేవలు, దీర్ఘ వ్యాధులు, తేలు, జెర్రి కాటులకు చికిత్స, మందులు ఉచితంగా అందజేస్తున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే టెలిమెడిసిన్‌లో ఈ సంజీవని యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో స్పెషలిస్టులకు తెలియజేసి, వారి ద్వారా తగిన సూచనలతో మందులు ఇస్తున్నారు.

105 రకాల మందులు : విలేజ్ క్లినిక్‌లో 105 రకాల మందుల్ని అందుబాటులో ఉంచారు. పీహెచ్‌పీ, సీహెచ్‌సి ఆసుపత్రులకు సమానంగా విలేజ్ క్లినిక్ ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉంటున్నాయి. ఆల్‌బెండ్‌జోల్, అమాక్సిలిన్, ఎటినాల్, బీ.కాంప్లెక్స్, కాల్షియం, విటమిన్ టాబెట్లు, కాపర్‌టీ, సుగర్, బీపీ తదితర మందులన్నీ అందుబాటులో ఉన్నాయి. గుండె, కిడ్నీ, కన్ను, కాళ్లు, కీళ్ళు నొప్పులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచారు.

ఓఎన్జీసీ అధికారులతో కలెక్టర్ సమీక్ష



రైతులు, ఓఎన్‌జీసీ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): ఓఎన్‌జీసీ పైపులైన్లు వెళ్లే గ్రామాలకు సాధ్యమైనంత మేర న్యాయం చేస్తామని, ఆయా గ్రామాల రైతులు అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సీతారామపురం సౌత్, యర్రంశెట్టివారిపాలెం, రుస్తుంబాద గ్రామాల రైతులతో, ఓఎన్‌జీసీ అధికారులతో కలెక్టర్ సుమిత్ కుమార్ సమావేశమై చర్చించారు. ఆయా గ్రామాల ప్రజలకు సాధ్యమైనంత మేర న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టును అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. పైపులైన్లు వెళ్లే మూడు గ్రామాలకు ఒక్కొక్క గ్రామానికి 15 లక్షల రూపాయలు చొప్పున రూ.45 లక్షలు గ్రామాల అభివృద్ధికి ఓఎన్‌జీసీ అందిస్తుందన్నారు. పైపులైన్లు వెళ్లే మార్గంలో భూముల క్రయ విక్రయాలకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు. సమావేశంలో గ్రామస్తులు అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానమిచ్చారు. కలెక్టర్ ప్రతిపాదనలకు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

● శ్రీవారి క్షేత్రంపై హరివిల్లు సోయగం





శ్రీవారి క్షేత్రంలో సోమవారం సాయంత్రం ఇంద్రధనుస్సు కనువిందు చేసింది. ఆకాశం మేఘావృతమై, జోరున వర్షం కురిసి వెలిసిన తరువాత క్షేత్రంపై హరివిల్లు విరిసింది. భక్తులు, స్థానికులకు కనువిందు చేసింది. శ్రీవారి ఆలయ రాజగోపురాలపై కనిపించిన ఇంద్రధనుస్సును ప్రతి ఒక్కరూ తమ సెల్‌ఫోన్‌లతో ఫొటోలు తీసి సందడి చేశారు. – ద్వారకాతిరుమల

సూర్య ప్రభ వాహనంపై దేవదేవుడు

యోగ శ్రీనివాసుడిగా శ్రీవారి దర్శనం

ద్వారకాతిరుమల: సూర్య ప్రభ వాహనంపై మెరిసిన ఆ దేవదేవుడిని కనులారా వీక్షించిన భక్తజనులు పులకించారు. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో జరుగుతున్న శ్రీవారి వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా పంచాయుధాలైన శంఖు, చక్రం, గద, పద్మం, ధనుస్సు ధరించి, నారాయణమూర్తి అలంకరణలో సూర్యప్రభ వాహనాన్ని అధిరోహించిన శ్రీవారికి అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేసి, హారతులిచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, గజ, అశ్వ సేవల నడుమ శ్రీవారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించి తరించారు. సూర్యప్రభ వాహనంపై ఉన్న శ్రీవారిని దర్శించిన భక్తులకు సూర్యదేవుని అనుగ్రహంతో సకల విద్యా, ఆరోగ్య, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని పండితులు చెబుతున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీహరి కళాతోరణ వేదికపై నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ముఖ మండపంలో యోగ శ్రీనివాసుడి అలంకారణలో దర్శనమిచ్చిన శ్రీవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించారు. ఇదిలా ఉంటే రాత్రి స్వామివారికి చంద్రప్రభ వాహనంపై జరగాల్సిన తిరువీధి సేవ వర్షం కారణంగా రద్దయ్యింది.





స్వామి, అమ్మవార్లకు హారతులిస్తున్న అర్చకులు, సూర్యప్రభ వాహనంపై ఊరేగింపు



యోగ శ్రీనివాసుడి అలంకారంలో శ్రీవారు



అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7 గంటల నుంచి–హనుమద్వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ
- ఉదయం 7 నుంచి – భజన కార్యక్రమాలు
- ఉదయం 9 నుంచి – కూచిపూడి భరతనాట్య ప్రదర్శనలు
- ఉదయం 11 నుంచి – భక్తి రంజని
- సాయంత్రం 4 నుంచి – నాదస్వర కచేరి
- రాత్రి 7 నుంచి – ఎదుర్కోలు ఉత్సవం
- రాత్రి 8.30 నుంచి – వెండి శేషవాహనంపై తిరువీధి సేవ
- రాత్రి 9 నుంచి – నాటకం

ప్రత్యేక అలంకరణ :
రామ లక్ష్మణ సమేత హనుమాన్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

జేసీ ప్రవీణ్ ఆదిత్య



భీమవరం: ఈ నెల 24 నుంచి జూన్ 1 వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా వాటిలో 10,946 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉందన్నారు. పరీక్షా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. 24న ప్రారంభమయ్యే ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం.5.30 వరకు జరుగుతాయన్నారు. జూన్ 6న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, 7న ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలుంటాయన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సమయానికి కంటే గంట ముందుగా హాజరు కావాలన్నారు. వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రాల్లో మంచినీటి సరఫరా, పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేసి, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని 90595 83683 నెంబరును సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ఇంటర్మీడియట్ ఆర్‌ఐవో, జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ కె.చంద్ర శేఖర్‌బాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా లోన్ మేళా

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఈ నెల 22న ఎంఎస్‌ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మెగా లోన్‌మేళా నిర్వహించనున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ దాసరి దేవరాజ్ తెలిపారు. ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లకు మద్దతుగా ఈ లోన్ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 22న ఉదయం 10 గంటలకు నోరీ హాస్పిటల్ సమీపంలోని ఎంఎస్‌ఎంఈ కార్యాలయంలో మెగాలోన్ మేళాకు హాజరు కావాలన్నారు. 79959 15450, 89197 37517 నెంబర్లలో కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని చెప్పారు.

ఉత్తమ ప్రదర్శనగా 'మలిసంధ్య'



ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన మలిసంధ్య నాటిక బృందంతో యూత్ క్లబ్ సభ్యులు

యలమంచిలి: కొంతేరు గ్రామంలోని శ్రీ పులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిర్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన 42వ అఖిల భారత నాటిక పోటీల్లో మలి సంధ్య ఉత్తమ ప్రదర్శనగా మొదటి బహుమతి గెలుచుకుంది. విజేతలకు యూత్ కమిటీ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పాలకొల్లు చాంబర్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ చేగొండి సత్యనారాయణమూర్తి, పాలకొల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ ఉన్నమట్ల కబర్ది, సినీ, టీవీ ఆర్టిస్ట్ డేవిడ్‌రాజు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతలను ఎత్తిచూపి వాటికి పరిష్కారం చూపడంలో నాటికలు ప్రధాన పాత్ర వహిస్తాయన్నారు. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా క్షేత్రం, తృతీయ ప్రదర్శనగా మళ్లీ కలిసి జీవిద్దాం నాటికలు ఎంపికయ్యాయి. ఉత్తమ దర్శకుడిగా డీవీ చంద్రశేఖర్, ఉత్తమ రచయితగా ఆకురాతి శిల్ప ఎంపికయ్యారు. ఉత్తమ నటుడిగా పి.ముత్యాలరావు, ఉత్తమ నటిగా జ్యోతి రాణి, ఉత్తమ ప్రతినాయకుడిగా ఎస్ సూర్య, ఉత్తమ హాస్య నటుడిగా వరికూటి శివప్రసాద్ నిలిచారు. ఈ పోటీలకు కొంతేటి సర్వేశలింగం, కత్తుల రామమోహనరావు, కొడమంచిలి సత్యప్రసాద్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీల నిర్వహణకు యూత్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు పులపర్తి రాజగోపాలరావు, కార్యదర్శి గంటా ముత్యాలరావు నాయుడు, ఉపాధ్యక్షులు బోణం రవిబాబు, జక్కంశెట్టి సుబ్రహ్మణ్యం, కోశాధికారి అంబటి నవీన్‌చంద్, సహాయ కార్యదర్శులు బోడపాటి రాజశేఖర్, సుదర్శనం శ్రీనివాస్ తదితరులు సహకారం అందించారు.

నేటి నుంచి జగన్నాథ కల్యాణోత్సవాలు



ఆలయంలోని దారు(చెక్క) విగ్రహాలు



ఆలయ ఆవరణలో కొలువైన వేణుగోపాలస్వామి

ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన వడాలి శ్రీ సుభద్ర బలరామ సహిత శ్రీజగన్నాథ స్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలు మంగళవారం నుంచి అంగరంగ వైభవంగా జరగనున్నాయి. జిల్లాలో ఈ ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. సుదూర ప్రాంతాల నుంచి ప్రతి నిత్యం అనేకమంది భక్తులు ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకుంటారు. ఉత్సవాలు 5 రోజులపాటు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గుంటూరుజిల్లా బాపట్ల తాలుకా కర్లపాలెం గ్రామంలో శ్రీశ్రీశ్రీ పురుషోత్తమ అవధూత జగన్నాథస్వామికి పరమభక్తుడని ఆధారాలు చెబుతున్నాయి. పురుషోత్తమ అవధూత 1765లో జగన్నాథస్వామికి ఆలయాన్ని నిర్మించాలనే కోరికతో సంచారం ప్రారంభించారు. కొంతకాలానికి ప్రస్తుతం వడాలిగా వ్యవహరిస్తున్న గ్రామానికి చేరుకోగా అక్కడ కొందరు బోయలు రావిచెట్టు కింద హరినామ సంకీర్తన చేయడం చూసి పవిత్రమైన ప్రదేశంగా భావించి ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు.

నైజాం నవాబు సాయం : ఆలయ నిర్మాణానికి, నిర్వహణకు భూమి, నిధులు అవసరమయ్యాయి. అప్పట్లో ఈ ప్రాంతం నైజాం నవాబు పాలనలో ఉండేది. దీంతో పలువురు భక్తులు నవాబు సాయాన్ని అర్థించమని పురుషోత్తమ అవధూతకు సూచించడంతో ఆయన నైజాం నవాబును కలిసి ఆలయ నిర్మాణం, ప్రాధాన్యతను వివరించినట్లు ఆధారాలున్నాయి. దీనితో నవాబు ఉదారంగా ఆలయ నిర్మాణానికి, అలాగే నిర్వాహనకు వెయ్యి ఎకరాలు దానంగా ఇచ్చారు. టీటీడీ, దేవస్థాన నిధులతో 2001లో ఈ ఆలయాన్ని పునఃనిర్మించారు.

కార్యక్రమాల వివరాలు : ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు 21న స్వామివారిని పెండ్లికుమారుడిగా, అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలంకరిస్తారు. 22 రాత్రి వేణుగోపాలస్వామితో రుక్మిణి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. 23న రథోత్సవం, 24న పూర్ణహుతి, 25న పవళింపుసేవ, 26న ఉదయం అఖండ అన్నసమారాధన జరుగుతాయని ఈవో తెలిపారు. ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 21న కూచిపూడి ప్రదర్శన, 22న కోలాటం, 23న ఇంద్రజాలం, 24న సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం, 25న బాలనాగమ్మ జానపద నాటకం ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

అదనపు కట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య

పాలకోడేరు: అదనపు కట్నం వేధింపులు భరించలేక ఉరి వేసుకొని ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. మొగల్తూరు మండలం కోటదిబ్బ గ్రామానికి చెందిన దొడ్డా సుస్మితకు గొల్లలకోడేరుకు చెందిన తోట త్రినాథ్ ప్రసాద్‌తో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. ఆదివారం రాత్రి సుస్మిత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పెళ్లి అయినప్పటి నుంచి అదనపు కట్నం కోసం భర్త, అత్త మామలు శారీరకంగా, మానసికంగా వేధించేవారని మృతురాలి తండ్రి దొడ్డా సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



సాగర తీరం.. ఆహ్లాదకరం

- పేరుపాలెం, కేపీపాలెం బీచ్‌లకు సందర్శకుల తాకిడి
- పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు జగన్ సర్కార్ చర్యలు
- మౌలిక వసతుల కల్పనకు, రహదారుల అభివృద్ధికి కృషి



కార్తీక మాసంలో బీచ్‌కు తరలివచ్చిన సందర్శకులు (ఫైల్)

మొగల్తూరు : ఉమ్మడి జిల్లాలోని నరసాపురం నియోజకవర్గంలో 19 కిలోమీటర్ల మేర సాగర తీర ప్రాంతం ఉంది. ప్రకృతి రమణీయత, ఆహ్లాదకర వాతవరణం, ఎగసి పడే అలలను చూస్తూ సేదతీరడమంటే ప్రతి ఒక్కరికీ ఇష్టమే. దీంతో ఇక్కడ ఉన్న పేరుపాలెం, కేపీపాలెం బీచ్‌లకు సందర్శకుల తాకిడి విపరీతంగా పెరిగింది. దీనికితోడు ఇక్కడ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020 బీచ్ ఫెస్టివల్ నిర్వహించడంతో ఇక్కడ పర్యాటకుల రద్దీ మరింతగా పెరిగింది. పేరుపాలెం, కేపీపాలెం బీచ్‌లకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి బీచ్‌లుగా నామకరణం చేశారు. రోజురోజుకి పర్యాటకుల సందడి పెరగడంతో పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సంకల్పించారు. బీచ్‌లలో మౌలిక వసతుల కల్పనకు, బీచ్‌లకు వచ్చే రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు.



కేపీపాలెం బీచ్‌లో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ విగ్రహం



మొళ్ళపర్రు బీచ్ సమీపంలో ఏర్పాటు చేసిన 54 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం

తీరంలో రూ.కోటితో వైఎస్సార్ విగ్రహం

వైఎస్ రాజశేఖర్ రెడ్డి బీచ్‌గా పిలుస్తున్న కేపీపాలం బీచ్‌లో రూ.కోటి వ్యయంతో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 20 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటుకు గత ఏడాది మే 11న చీఫ్ విప్ ప్రసాదరాజు శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ విగ్రహంతో పాటు ఆయన జీవిత విశేషాలను తెలియజేసేలా మ్యూజియం, సందర్శకులు కూర్చునేలా పచ్చని లాంజ్ ఏర్పాటుకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

రూ.20 లక్షలతో బీచ్‌లో సౌకర్యాలు

పేరుపాలెం, కేపీపాలెం బీచ్‌లు నిత్యం రద్దీగా మారాయి. ఆదివారం అయితే సందర్శకులు భారీగా తరలివస్తున్నారు. ఇక కార్తీకమాసం నెల రోజులు ప్రతి ఆది, బుధవారాల్లో వేలాది మంది పర్యాటకులు సముద్ర స్నానం చేసి తీరంలోని సరుగుడు తోటలో వనభోజనాలు చేస్తుంటారు. దీంతో పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో వారు సేదతీరడానికి షెడ్లు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించేందుకు రూ.20 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

యువ టూరిజమ్ క్లబ్‌లు

జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, వాటి విశిష్టత, టెంపుల్ టూరిజమ్, సంస్కృతి సంప్రదాయలపై అవగాహన కల్పించేందుకు ఎంపిక చేసిన కాలేజీల్లో యువ టూరిజమ్ క్లబ్‌ల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ కృషి చేస్తున్నారు. ఈ క్లబ్‌ల ద్వారా 25 నుంచి 30 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి అవగాహన కల్పిస్తారు.

పర్యాటకంగా అభివృద్ధికి చర్యలు



వైఎస్ రాజశేఖర్ రెడ్డి బీచ్‌లుగా నామకరణం చేసిన కేపీపాలెం, పేరుపాలెం బీచ్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. బీచ్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. బీచ్‌లకు వచ్చే పర్యాటకులకు కోసం రూ.కోట్లాది రూపాయలతో రహదారులు అభివృద్ధి చేస్తున్నాం. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తున్నారు.

– ముదునూరి ప్రసాదరాజు, చీఫ్ విప్



మొళ్ళపర్రు బీచ్ నుంచి కేపీపాలెం బీచ్ వరకు నిర్మించిన రహదారి

బీచ్‌కు వచ్చే రహదారుల అభివృద్ధి

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బీచ్‌లకు వచ్చే పర్యాటకులకు రవాణా సౌకర్యం మెరుగపర్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంది. రూ.4.30 కోట్లతో నరసాపురం మండలం బియ్యపుతిప్ప గ్రామం నుంచి వేములదీవి, చినమైనవానిలంక, పీఎం లంక మీదుగా వయా కేపీపాలెం, పేరుపాలెం బీచ్‌లను కలుపుతూ సముద్రం శివారు ఏటిమొగ వరకు సుమారు 12 కిలోమీటర్ల రహదారి పనులు జరుగుతున్నాయి. ముత్యాలపల్లి, మోడి మీదుగా పేరుపాలెం బీచ్ వరకు, సీతారాంపురం, కేపీపాలెం మీదుగా పేరుపాలెం సెంటర్ వరకు కలిసి మంజూరైన రూ.28 కోట్ల నిధులతో రహదారి పనులు దాదాపుగా పూర్తికావచ్చాయి. మొళ్ళపర్రు బీచ్ నుంచి కేపీపాలెం బీచ్ వరకు రూ.3 కోట్లతో చేపట్టిన రహదారి పనులు సైతం పూర్తికానున్నాయి. అంతేకాక తీరప్రాంత గ్రామాల నుంచి బీచ్‌కు వచ్చే అన్ని రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



ముత్యాలపల్లి - మొళ్ళపర్రు బీచ్ రోడ్డులో భాగంగా మోడి గ్రామంలో పూర్తయిన సీసీ రోడ్డు



పేరుపాలెం బీచ్‌లో టూరిజం శాఖ ఏర్పాటు చేసిన హంస రిసార్ట్స్



తీరంలోని వేలాంగిణీ మాత ఆలయం



మోడి గ్రామం నుంచి పేరుపాలెం సుబ్బారాయుడి గుడి వరకు పూర్తయిన సీసీ రోడ్డు

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు



లారీ చక్రాల కిందకు వెళ్లిన మోటార్ సైకిల్

యలమంచిలి: మేడపాడు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడ్డారు. బూరుగుపల్లి పంచాయతీ మట్టవానిచెరువు గ్రామానికి చెందిన బండి రమేష్, సత్యవాణి శిరగాలపల్లి రోడ్డు నుంచి మేడపాడు-యలమంచిలి రోడ్డు ఎక్కుతుండగా ఎదురుగా వచ్చిన లారీ కిందకు మోటార్ సైకిల్ వెళ్లింది. లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఇరువురు క్షేమంగా బయటపడ్డారు. అయితే సడన్ బ్రేక్ వేయడంతో లారీ పక్కకు వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టగా స్తంభం రెండు ముక్కలైంది. ఆ సమయంలో రోడ్డు మీద ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్ సిబ్బంది హుటాహుటీన వచ్చి కొత్త స్తంభం వేసి విద్యుత్ పునరుద్ధించారు. గాయపడిన ఇరువురిని పాలకొల్లు ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి ఉన్నత వైద్యం నిమిత్తం రాజమండ్రి తరలించారు. రోడ్డు పక్కగా బరకం కట్టడం వలనే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. బరకం వలన రోడ్డు కనిపించకపోవడంతో ఈ ప్రాంతంలో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

15 నుంచి రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభలు

ఏలూరు (టూటౌన్): ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలను జూన్ 15, 16, 17 తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.ఝాన్సీ తెలిపారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మహాసభల వివరాలను వెల్లడించారు. ఈ మహాసభలకు రైతు సంఘాల నాయకులు, 9 రాష్ట్రాల నుంచి సౌహార్థ ప్రతినిధులుగా రైతు ఉద్యమ నాయకులు హాజరవుతున్నట్లు చెప్పారు. జూన్ 15న బహిరంగ సభ, 16న వివిధ రైతాంగ సమస్యలపై సదస్సు, 17న సంస్థ నిర్మాణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అనంతరం మహాసభల నిర్వహణకు కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు రావి గోపాలకృష్ణ, నాయకులు బండి వెంకటేశ్వరరావు, కిలాడి శ్రీనివాస్, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్ నాగరాజు, జిల్లా అధ్యక్షుడు పుణ్యం రామారావు, ఏజెన్సీ గిరిజన సంఘం గౌరవ అధ్యక్షుడు ఇళ్ల రామిరెడ్డి, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌కే బాషా తదితరులు పాల్గొన్నారు.

భిన్న వాతావరణంతో బెంబేలు

ఉదయం ఎండ.. మధ్యాహ్నం వర్షం

తణుకు: ఉదయం నుంచి తీవ్రమైన ఎండ వేడి.. మధ్యాహ్నం మాత్రం వర్షం... సాయంత్రమైతే వాతావరణం చల్లబడి భీకర గాలులు... ఇది ఇటీవలి కాలంలో చోటు చేసుకుంటున్న వాతావరణ పరిస్థితులు. పగలు ఎండ వేడిమితో అల్లాడిపోతున్న ప్రజలు సాయంత్రమైతే ఈదురుగాలులతో బెంబేలెత్తిపోతున్నారు. మరోవైపు అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో తణుకు ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇలా భిన్న వాతావరణ పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. వాతావరణంలో ద్రోణి, ఆవర్తనాలే ఇందుకు కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

40 డిగ్రీలకు పైగా నమోదు...

ఒకవైపు రోహిణి కార్తె ప్రవేశించకుండానే జిల్లాలోని తీవ్రమైన వడగాలులు వీస్తున్నాయి. ఏప్రిల్, మేలోనే జిల్లాలోని 40 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దీంతో ప్రజలు ఉక్కబోతకు గురై వృద్ధులు, పిల్లలు అగచాట్లు పడుతున్నారు. గడిచిన కొద్ది రోజులుగా వాతావరణంలో సంభవించిన మార్పుల కారణంగా విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. పగలంతా ఎండ తీవ్రంగా ఉండగా.. సాయంత్రానికి ఆకాశం మేఘావృతమై చల్లదనంగా మారుతోంది. ఇదే సమయంలో నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు సైతం కురుస్తున్నాయి. సాధారణంగా జూన్ మొదటి వారంలో రుతుపవనాలు ప్రవేశిస్తుంటాయి. వీటి రాకకు ముందు సముద్రంలో అల్పపీడనాలు, ఉపరితల ఆవర్తనాలు ఏర్పడుతుంటాయి. ప్రస్తుతం దక్షిణాది నుంచి ఒక ద్రోణి ఆవరించి ఉండటంతో సాయంత్రం కాగానే జిల్లాలో వాతావరణం మారుతోంది. మరోవైపు బలమైన ఈదురు గాలులు సైతం రైతులను బెంబేలెత్తిస్తున్నాయి.



పగలు ఎండ తాకిడికి నిర్మానుష్యంగా మారిన తణుకులో ప్రధాన కూడలి



తణుకులో మధ్యాహ్నం కురుస్తున్న భారీ వర్షం


విభిన్న పరిశోధనలు దేశ అభ్యున్నతికి దోహదం



మాట్లాడుతున్న పి.దినేష్ శంకరరెడ్డి


తాడేపల్లిగూడెం (టీఓసీ): విభిన్న పరిశోధనలు దేశ అభ్యున్నతికి దోహదపడతాయని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకరరెడ్డి అన్నారు. సంస్థలోని బయోటెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం ఆధీనంలోని సెర్బ్ సహకారంతో ప్రాసెస్ మోడలింగ్ సిమ్యులేషన్ అండ్ ఆప్టిమైజేషన్ ఇన్ బయోలాజికల్ సిస్టమ్స్ ఏ హాండ్స్ ఆన్ ట్రెనింగ్ అప్రోచ్ అనే అంశంపై కార్యశాల హై ఎండ్ వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ వర్క్‌షాప్ ఈనెల 26వ తేదీ వరకు జరగనుంది. దినేష్ శంకరరెడ్డి మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు సంస్థ కల్పిస్తున్న వనరులను సద్వినియోగం చేసుకుని, వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని వెల్లడించారు. డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్కే శాస్త్రి మాట్లాడుతూ బయో టెక్నాలజీ రంగం చాలా అభివృద్ధి చెందిన రంగమని చెప్పారు. ఔషధాలు, బయో ఇంధనాలు, ఇతర ఉత్పత్తుల నాణ్యత, దిగుబడులను పెంచేందుకు ఇటువంటి వర్క్‌షాపులు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (చెన్నై) ఎన్విరాన్మెంటల్ సైన్స్ ల్యాబ్ హెడ్ అండ్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ పి.షణ్ముగం మాట్లాడుతూ తోళ్ల పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాల వాటర్‌తో బయోగ్యాస్‌ని ఎలా తయారు చేయాలి, బయో గ్యాస్ ఉత్పత్తికి ఎలాంటి బయో రియాక్టర్లను వాడాలి, వాటిని ఎలా డిజైన్ చేయాలి, బయో గ్యాస్ ప్రాధాన్యత వంటి అంశాలను గురించి విద్యార్థులకు వివరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించారు. బయో టెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సుదర్శన్ దీప, ఆర్గనైజర్ డాక్టర్ రాజేశ్వరరెడ్డి, ఆచార్యులు జగన్ మోహన్‌రావు, డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ బాబూరావు, డాక్టర్ కార్తికేయ శర్మ, డాక్టర్ యువరాజ్, డాక్టర్ భరణీదరన్, డాక్టర్ సుభానీ, డాక్టర్ తలారీ రేష్మా పాల్గొన్నారు.

పశువుల బీమా.. రైతులకు ధీమా




చింతలపూడి: రాష్ట్రంలో పాడి రైతులు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకం దారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పశు బీమా పథకం ప్రవేశపెట్టింది. గతంలో ఉన్న వైఎస్సార్ పశునష్ట పరిహార పథకం స్థానంలో దీన్ని ప్రవేశపెట్టారు. పాడి పశువులు, గొర్రెలు, మేకలు, పందులు చనిపోతే కలిగే నష్టం నుంచి రైతులకు, పశువుల పెంపకందార్లకు తగిన రక్షణ కలిచడానికి ఈ పథకం ఉపయోగపడుతుంది.

- ఈ పథకంలో గరిష్టంగా ఒక కుటుంబానికి 5 గేదెలు, 50 గొర్రెలు, మేకలు, పందులకు బీమా చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ పథకంలో రూ.30 వేల ఖరీదు చేసే ఆవు లేదా గేదెకు మూడేళ్లకు కలిపి 6.4 శాతం అంటే రూ.1,920 ప్రీమియంగా నిర్ణయించారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులకు రూ.384, ఏపీఎల్ (ఓసీ) లబ్ధిదారులకు రూ.960 లబ్ధిదారుని వాటాగా చెల్లించాలి.
- అదే రూ.15 వేలు ఖరీదు చేసే ఆవుకు, గేదెకు మొత్తం ప్రీమియం 6.4 శాతంగా రూ.960గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులకు రూ.192, ఏపీఎల్(ఓసీ) లబ్ధిదారులు రూ.480 చెల్లించాలి.
- అదే విధంగా రూ.6 వేలు ఖరీదు చేసే గొర్రెలు, మేకలు, పందులకు ప్రీమియం ఒక సంవత్సరానికి 3 శాతం అంటే రూ.180గా నిర్ణయించారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.36, ఏపీఎల్(ఓసీ) లబ్ధిదారులు రూ.90 లబ్ధిదారుని వాటాగా చెల్లించాలి. ఇదే తరహాలో ప్రీమియం రెండేళ్లకు అయితే 4.5 శాతం రూ.270గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.54, ఏపీఎల్(ఓసీ) లబ్ధిదారులు రూ.135 చెల్లించాలి. అదే మూడు సంవత్సరాలకు ప్రీమియం 6.25 శాతం అంటే రూ.375గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.75, ఏపీఎల్(ఓసీ) లబ్ధిదారులు రూ.187.50 లబ్ధిదారుల వాటాగా చెల్లించాల్సి ఉంటుందని పశుసంవర్ధకశాఖ ఏడీ జె లింగయ్య తెలిపారు. సబ్సిడీ పోను మిగిలిన ప్రీమియం మొత్తం ప్రభుత్వమే భరిస్తుంది.
- బీమా పాలసీ అమలులో ఉండగానే పాడి పశువును విక్రయించడమో లేదా మరొకరికి అప్పగించడమో జరిగితే పాలసీ పూర్తయ్యే గడువులోగా లబ్ధిదారునికి ఉండే అధికారాన్ని పాడి పశువు కొత్త యజమానికి బదలాయించాల్సి ఉంటుంది. దీనికి అనుసరించవలసిన పద్ధతులను బీమా కంపెనీతో ముందుగానే ఒప్పందం చేసుకోవాలి.



మెట్ట ప్రాంతంలో మేత మేస్తున్న గేదెలు



గొర్రెల మంద



జె లింగయ్య, ఏడీఏ, పశుసంవర్ధక శాఖ

క్లెయిమ్‌ల పరిష్కారం ఎలా

లబ్ధిదారునికి క్లెయిమ్‌లు చెల్లించవలసిన సందర్భంలో అవసరమైన పత్రాలను అందజేసిన గడువులోగా బీమా మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. క్లెయిమ్‌ల కోసం సమర్పించాల్సిన పత్రాలు, వివరాలను ముందుగానే పాలసీదారునికి ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు అందచేయాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఇరగవరం: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు అన్నారు. మండలంలోని ఎంపిడివో కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పద్మజ్యోతి మాట్లాడుతూ మండలం అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుగుణంగా ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అభివృద్ధి పనులకు సంబంధించి ఎటువంటి చర్చ జరగలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై విద్యార్థులకు అవగాహన



పోస్టల్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న పోస్టుమాస్టర్ సుబ్బారావు

అత్తిలి: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు పోస్టల్ పథకాలపై పోస్టుమాస్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు అవగాహన కల్పించారు. పోస్టల్‌శాఖ ద్వారా కల్పిస్తున్న సేవింగ్ ఖాతాలు తెరవడం, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఆధార్‌కార్డు వంటిపలు సేవలను వివరించారు. అనంతరం విద్యార్థులు నీతి కథలు, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష కార్యక్రమాలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రిసోర్సు పర్సన్ కె కోమలి, బి మహాలక్ష్మి, గంధం శేషవేంద్రరావు, ఎం శ్రీదేవి, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి తిరుకల్యాణోత్సవం



వేల్పూరులో ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వర స్వామి

తణుకు టౌన్: మండలంలోని వేల్పూరు గ్రామంలో శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి వారి 54వ కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి ఆలయ ఆవరణలో జరిగిన స్వామివారి తిరు కల్యాణంలో గ్రామానికి చెందిన పెనుమర్తి వీరాస్వామి, సుబ్బలక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో వారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ యడ్లపల్లి శ్రీను, నాయకులు గుణ్ణం రంగారావు, రెడ్డి సత్తిరావు, ఆలయ ఈవో ఇతర సభ్యులతో పాటు పరిశర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు.

ప్రశాంతంగా ఈఏపీ సెట్ పరీక్షలు



పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులలో ప్రవేశాలకు గాను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈఏపీ సెట్ ఐదోవ రోజున సోమవారం తాడేపల్లిగూడెంలో ఇంజనీరింగ్ విభాగంలో పరీక్షలు జరిగాయి. శ్రీ వాసవిలో నిర్వహించిన పరీక్షకు 250 మందికి గాను 244 మంది, సాయంత్రం నిర్వహించిన పరీక్షకు 250 మందికి 247 మంది విద్యార్థులు, మొత్తం 500 మంది విద్యార్థులకు 491 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు తెలిపారు. పరీక్షా కేంద్రం కో ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా సురేష్, టీసీఎస్ ప్రతినిధులు పరీక్ష తీరును పర్యవేక్షించారు.

వైద్య శిబిరం

పాలకొల్లు అర్బన్: గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తోన్న ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్య సౌజన్య కోరారు. పాలకొల్లు మండలం సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు.

వైఎస్సార్ చేయూత, విద్యాదీవెన నిధులు విడుదల



తణుకులో శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల



తణుకులో వైఎస్సార్ చేయూత కార్యక్రమానికి హాజరైన మహిళలు (ఫైల్)

- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- వైఎస్సార్ చేయూతకు రూ. 92.34 కోట్లు
- విద్యాదీవెనకు రూ. 4.54 కోట్లు

తణుకు అర్బన్: పేదవర్గాలకు ఆర్థికంగా అండగా నిలబడాలనే ఉద్దేశ్యంతో 2019 నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో అందించిన సంక్షేమం సత్ఫలితాలనిచ్చింది. పేదవర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు ఆసరాగా నిలిచాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రభుత్వం ఏర్పడిని రోజు నుంచి కోవిడ్ తదితర కారణాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందులు ఎదురైనప్పటికీ ఏఒక్క సంక్షేమ పథకాన్ని నిలిపివేయకుండా క్యాలెండర్ ప్రకారం అమలు చేశారు. ఇందులో భాగంగా ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నిధులు విడుదల చేసిన వైఎస్సార్ చేయూత, విద్యాదీవెన పథకాలకు సంబంధించి ఎన్నికల కోడ్‌తోపాటు ఎన్నికల అధికారికి చంద్రబాబు వేయించిన పిటిషన్ కారణంగా తుది విడత లబ్ధి పూర్తిస్థాయిలో లబ్ధిదారుల ఖాతాలకు జమకాలేదు. అప్పుడు బ్రేక్ పడిన లబ్ధి తాజాగా రెండు రోజుల నుంచి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ అవుతుంది. దీంతో ఆ పథకాల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యాదీవెన నిధులు రూ. 4.54 కోట్లు...

పేదవర్గాల పిల్లలు ఉన్నత విద్యనభ్యసించి మంచి ఉద్యోగాలు పొందాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం పేదల విద్యకు విద్యాదీవెన పథకం ద్వారా అండగా నిలిచింది. పేదింటి కుటుంబాలను ఆర్థికంగా నిలబెట్టాలంటే వారి బిడ్డల చదువే అభివృద్ధికి తోడ్పడుతుందనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన మాటలను అక్షరాలా ఆచరణలో పెట్టారు. టీడీపీ హయాంలో ఫీజురీయింబర్స్‌మెంట్‌గా ఏడాదికి కేవలం రూ. 35వేలు మాత్రమే ఇవ్వగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విద్యాదీవెన ద్వారా ఆ ఏడాది పూర్తి ఫీజును రీయింబర్స్‌మెంట్‌గా విద్యార్థులకు అందిస్తోంది. ప్రతి ఏడాది త్రైమాసికంగా చదువుకు అయ్యే ఖర్చును విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమచేసి ఆ మొత్తాన్ని కళాశాలల్లో చెల్లించే రీతిలో ప్రణాళిక ప్రకారం అమలు చేశారు. దీంతో పేద విద్యార్థులు సైతం ఇంజనీరింగ్, వైద్యవిద్య, డిగ్రీ తదితర కోర్సులతో పాటు విదేశీవిద్య సైతం అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాల్టీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి ఈ 2019 నుంచి ఇప్పటివరకు 5557 మంది విద్యార్థులకుగాను రూ. 4.54,36,314లు తల్లుల ఖాతాల్లోకి ప్రభుత్వం నిధులు జమచేసింది.

నియోజకవర్గంలో వైఎస్సార్ చేయూతతో రూ. 92.34 కోట్లు లబ్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లో భాగంగా ప్రతిష్టాత్మకంగా అందించిన వైఎస్సార్ చేయూతతో మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. 45 నుంచి 60 సంవత్సరాల్లోపు వయసున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ మహిళలందరికీ వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18,750లు చొప్పున 4 విడతల్లో రూ. 75 వేలు ఇప్పటికే అందచేశారు. దీంతో మహిళలు చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేద, బడుగు బలహీనవర్గాలంతా అభివృద్ధి బాట పడుతున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాల్టీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాకు సంబంధించి వైఎస్సార్ చేయూత ద్వారా నాలుగు విడతల్లో 12,312 మంది లబ్ధిదారులకు రూ. 92.34 కోట్లు అందజేశారు.

చదువంతా ఉచితమే..



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అర్హులైన పేద విద్యార్థులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యను పూర్తి ఉచితంగా అందిజేస్తున్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ఎంత చదువుకున్నా ఉచితమే అంటూ డిగ్రీ, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్‌తో పాటు విదేశీ విద్య కూడా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుంది.

– యిండుగపల్లి బలరామకృష్ణ, వైఎస్సార్ సీపీ తణుకు పట్టణ జేసీఎస్ కన్వీనర్

మహిళల ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్ చేయూత



వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు విడతల్లో అందించిన రూ. 75వేలు లబ్ధితో కొందరు మహిళలు చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటుండగా మరి కొందరు వారి అవసరాలు తీర్చుకున్నారు.

– షేక్ ఫహీమా, వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ తణుకు నియోజకవర్గ అధ్యక్షురాలు

రేపటి నుంచి పడాలలో క్రీస్తు సువార్త సభలు

పెంటపాడు: ఈనెల 22నుంచి మూడురోజులపాటు పడాల వాక్యజ్యోతి చర్చి ఆధ్వర్యంలో క్రీస్తు సంపూర్ణ సువార్త సభలు నిర్వహించనున్నట్లు డీపీఏ సంఘ జిల్లా అధ్యక్షుడు కె. జాజిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పడాల మార్కెట్ యార్డు సమీపంలో బేతిరెడ్డి అమ్మిరెడ్డి స్థలంలో ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఈ సభలలో విశాఖపట్నంకు చెందిన దైవసేవకులు శామ్యూల్ కర్మోజి, గుంటూరుకు చెందిన అంతర్జాతీయ సువార్తికులు కొండవీటి బాబూరావు, గుడివాడకు చెందిన కిరణ్‌పాల్, గాయకులు సిరివెళ్ల హనోక్, కొమ్మిశెట్టి ఘనరాజు తదితరులు పాల్గొంటారన్నారు. ఈ సభలను పరిసర గ్రామాల ప్రజలు, విశ్వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

విజ్ఞాన శిబిరాలతో ఎంతో లాభం



వేల్పూరు గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లీషుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులలో భాగంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆశక్తి కలిగించే వివిధ అంశాలను రీసోర్సు పర్సన్‌లు వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కే సత్యనారాయణ, రిటైర్డ్ ఏఈ కేఆర్ చక్రధరరావు, ఏ ధనరాజు, గ్రంథాలయ అధికారి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాల్టీలో కలిపితే ఐక్యంగా పోరాడతాం



కొండ్రుప్రోలు గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలతో మాట్లాడుతున్న కండెల్లి సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: కొండ్రుప్రోలు గ్రామాన్ని మున్సిపాల్టీలో కలిపితే ఐక్యంగా పోరాడతామని గ్రామస్తులు హెచ్చరించారు. సోమవారం మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు సందర్శించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్ల క్రితం తమ గ్రామాన్ని తాడేపల్లిగూడెం మున్సిపాలీలో విలీనం చేశారని, అప్పట్నించి ఉపాధి పనులు లేకుండా పోయాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పూర్తి స్థాయిలో పనులు కల్పించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. దీనిపై కండెల్లి సోమరాజు మాట్లాడుతూ పట్టణంలో విలీనం చేసినా గ్రామంలో పూర్తి స్థాయిలో పనులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బుడిగిన లక్ష్మి, దిర్శిపాముల సుబ్బారావు, మార్లపూడి వీరాస్వామి, మందాల తులసమ్మ, నీలపాల అంజయ్య, మర్లపూడి రామారావు, ఉప్పలపాటి సత్తియ్య, కొమ్ము చంటి పాల్గొన్నారు.

22న పూలపల్లిలో పాస్టర్లకు ఉచిత వైద్య శిబిరం

పాలకొల్లు అర్బన్: ఈ నెల 22వ తేదీ బుధవారం ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు పూలపల్లి ఎలీమ్ స్కూల్ ఆవరణలో పాలకొల్లు పట్టణ, రూరల్ పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో పాస్టర్ల కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు గోబేరు కృపాశ్యాంసన్ సోమవారం తెలిపారు. బీపీ, సుగర్, కిడ్నీ, కేన్సర్, సాధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సదావకాశాన్ని పట్టణ, రూరల్ గ్రామాల్లో పనిచేస్తున్న పాస్టర్ల కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భవిత కేంద్రంలో దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ



ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో మాట్లాడుతున్న పి.శ్యాంసుందర్, అధికారులు సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవిత కేంద్రంలో దివ్యాంగుల పిల్లలకు ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నామని పశ్చిమ గోదావరి జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ పి.శ్యాంసుందర్, సహిత విద్య సహాయ కో–ఆర్డినేటర్ టి.శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. దివ్యాంగుల పిల్లల ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం తాడేపల్లిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. కో–ఆర్డినేటర్ మాట్లాడుతూ భవిత కేంద్రంలో దివ్యాంగుల పిల్లలకు ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నారని, పిల్లల సామర్థ్యాన్ని గుర్తించి, సమాజంలో నార్మల్ పిల్లలతో సమానంగా విద్యలో రాణించటానికి అవసరమైన ప్రత్యేక విద్యతో పాటు, అవసరమైన వారికి ఉచితంగా ఉపకరణాలు, బోధన సామాగ్రి, బధిర, అంధ, విద్యార్థులకు ట్యాబ్లు, అమ్మఒడితో పాటు వివధ రకాలైన అలవెన్స్‌లు, ఇతర సౌకర్యాలు అందజేస్తున్నట్లు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పీఎం కే జ్యోతి, ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

గొప్ప రచయిత సీతారామశాస్త్రి



సమావేశంలో మాట్లాడుతున్న మండాబ్రహ్మాజీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): సిరివెన్నెల సీతారామశాస్త్రి తెలుగు సాహిత్యానికి ఒక వరమని, సినీ జగత్తులో గొప్ప రచయితగా పేరొందారని పలువురు సాహితీ ప్రముఖులు కొనియాడారు. సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి జయంతి సభ తాడేపల్లిగూడెంలో సోమవారం తెలుగు సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ సీతారామశాస్త్రి తెలుగు సినిమా పాటలకు జీవం పోశారని కొనియాడారు. విశ్వజనీయమైన సాహిత్యాన్ని తెలుగు చిత్రపరిశ్రమకు సిరివెన్నెల అందించారన్నారు. సీతారామశాస్త్రి బంధువు ప్రవా శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో బీఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించిన సరివెన్నెల సినిమాలకు పాటలు ఇక్కడ నుంచే రాయడం జరిగిందన్నారు. 11 నంది పురస్కారాలు, అనేక అవార్డులు సాధించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాహితీ సమాఖ్య అధ్యక్షులు మండా బ్రహ్మాజీ, కూనిరెడ్డి శ్రీనివాస్, సత్తి జగదీష్‌రెడ్డి, పైలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి

నరసాపురం: పిల్లలకు పుస్తక పఠనంపై ఆశక్తి పెంచాల్సిన అవసరం ఉందని నరసాపురం గ్రేడ్–1 గ్రంథాలయం లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి అన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో సోమవారం పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. కథలు చెప్పడం, యోగా, గణితం సబ్జెక్ట్‌లో మెళకువలు నేర్పించారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారని అన్నారు.. వచ్చేనెల 7వతేదీ వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. స్కూల్ అసిస్టెంట్లు శ్రీనివాస్, నాగలక్ష్మి, సుధీర్‌మోహన్, సూర్యంబాబు పాల్గొన్నారు.

వైభవంగా గోగులమ్మ జాతర మహోత్సవాలు





రాచర్లలో పూజలందుకొంటున్న గ్రామ దేవత గోగులమ్మ అమ్మవారు, ఆలయ పూరిగుడిలో ఘటాలు

పెంటపాడు: గ్రామంలో 22 ఏళ్లకు ఒకసారి నిర్వహించే రాచర్ల గోగులమ్మ అమ్మవారి ఉత్సవాలు ఈనెల 18 నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు పెట్టి, మొక్కుబడులు తీర్చుకొన్నారు. ఈనెల 18న అమ్మవారికి చిన్నసేవ జరగ్గా, ఈనెల 25న పెద్దసేవ, 26న భారీ జాతర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం అమ్మవారికి గ్రామ సర్పంచ్ వాకా దుర్గాభవాని, వెంకట సుబ్బారావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామీణులకు నాణ్యమైన వైద్యం



పెదమామిడిపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరంలో బీపీ పరిశీలిస్తున్న సత్యసౌజన్య

పాలకొల్లు అర్బన్: గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తోన్న ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్యసౌజన్య కోరారు. పాలకొల్లు మండలం వరిధనం సచివాలయ పరిధిలోని పెదమామిడిపల్లిలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. బాలింతలు, గర్భిణులకు పరీక్షలు చేసి ఆరోగ్య సూచనలే చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు ఆరోగ్య సలహాలు ఇచ్చి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ ఎస్తేరు, హెల్త్ అసిస్టెంట్ ఏఎస్ నాగరాజు, ఏఎన్ఎం సుధారాణి, డీఈవో సురేష్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిని రక్షించిన స్నేహితులు, సందర్శకులు

మొగల్తూరు: కేపీపాలెం బీచ్‌లో సోమవారం సముద్ర స్నానం చేస్తూ గల్లంతైన యువకుడ్ని స్నేహితులు, సాటి సందర్శకులు రక్షించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెనుగొండకు చెందిన 10 మంది యువకులు క్యాటరింగ్ పనినిమిత్తం నరసాపురం వచ్చారు. వారు తమ పనులు ముగించుకుని మధ్యాహ్నం నుంచి బీచ్‌కు వచ్చారు. కొంతసేపు సేదతీరిన తరువాత సముద్ర స్నానానికి దిగారు. సముద్రంలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ అలల ఉధృతికి దొంగ గౌతమ్ (20) కొట్టుకు పోతుండగా తోటి స్నేహితులు, అక్కడే స్నానం చేస్తున్న సందర్శకులు యువకుడిని పట్టుకుని రక్షించారు. అప్పటికే గౌతమ్ సముద్రపు నీరు మింగడంతో తీరానికి తీసుకువచ్చిన వెంటనే 108 వాహనంలో మెరుగైన చికిత్స నిమిత్తం నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు



వీకర్స్‌కాలనీలో స్థానికులకు సూచనలు చేస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ ఎ సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం వీకర్స్‌కాలనీలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జూన్ 4వతేదీన ఊరేగింపులు, డిజేలు, బాణాసంచాలు బంద్ చేస్తున్నట్లు తెలపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పట్టణంలో అల్లర్లు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఎన్నికల కమిషన్ ఆదేశాలను అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సైలు జీవీఎన్ ప్రసాద్, కె సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వారికి మల్లెల పుష్పార్చన



ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి



కాళ్లకూరు వెంకటేశ్వర స్వామికి మల్లెపూలార్చన చేస్తున్న అర్చకులు

కాళ్ల: కాళ్లకూరు శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మల్లెపూలార్చన నిర్వహించారు. కాళ్లకూరు గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు స్వామివారికి ఉదయం నిత్యోపాసన బలిహరణ, అష్టోత్తర సేవ నిర్వహించారు. శత(108) మల్లెల పుష్పార్చన, శేష వాహన సేవ గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం అరుణ్ కుమార్, ఆలయ అధికారులు సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రతిభను ప్రోత్సహిద్దాం



యండగండి డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ఉండి: విద్యార్థులు, చిన్నారుల్లో దాగి వున్న ప్రతిభను ఆయా సందర్భాల ద్వారా పోత్సహించాలని యండగండి గ్రంథాలయాధికారి ఎస్‌సీహెచ్ రామకృష్ణ అన్నారు. యండగండి గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా సోమవారం చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమలోని చిత్రలేఖన ప్రతిభను ప్రదర్శించారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి దానికి చేయూతనిస్తే వారు భవిష్యత్‌లో చాలా గొప్పవారవుతారని అన్నారు. కుటుంబమే కాదు దేశం గర్వపడేలా వారంతా ఎదుగుతారని అన్నారు. అందుకే వేదిక ఏదైనా చిన్నారులను ప్రోత్సహిస్తే వారు మరింతగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగేశ్న సత్యరాజ్, కోఆపరేటివ్ బ్యాంక్ కార్యదర్శి సీహెచ్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.